# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు








ప్రచురణ : జగిత్యాల సంపుటి : 07 సంచిక : 12 శుక్రవారం 04 - 09 - 2026 పేజిలు : 04 వెల రూ. 2


## మంత్రి కొండా సురేఖను పదవి నుంచి బర్తరఫ్ చేయండి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గవర్నర్‌కు సీఎం రేవంత్ లేఖ
- తక్షణం కొండా సురేఖను బర్తరఫ్ చేయాలంటూ లేఖ పంపిన సీఎం
- రాజీనామాకు కొండా సురేఖ ససేమిరా అనడంతో బర్తరఫ్ నిర్ణయం
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా చిన్నారెడ్డి కూడా తొలగింపు
- మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగించడం ఖరారైంది



**హైదరాబాద్ :**

రాష్ట్ర కాంగ్రెస్‌లో కొద్దిరోజులుగా నలుగుతున్న కొండా సురేఖ ఎపిసోడ్‌కు తెరపడింది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్ శివ్ ప్రసాద్ శుక్లాకు లేఖను పంపారు. దీంతో మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగించడం ఖరారైంది. అంతకు ముందు కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించేందుకు ఏఐసీసీ క్లియరెన్స్ ఇచ్చింది. దీంతో తక్షణమే కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌కు పంపిన లేఖలో స్పష్టం చేశారు. ఆ లేఖకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆమోదం తెలిపితే కొండా సురేఖ మంత్రి పదవి నుంచి బర్తరఫ్ అవుతారు. కొండా సురేఖను మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరినా అందుకు ఆమె నిరాకరించింది. దీంతో బర్తరఫ్ చేయాలని ముఖ్యమంత్రి లేఖ రాశారు. దీంతో పార్టీలో జరిగిన నాటకీయ పరిణామాలకు తెరపడినట్లైంది. పరకాల టికెట్ ఆశిస్తున్న కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు.. కొండాసురేఖను మంత్రివర్గం నుంచి తప్పించేందుకు కారణమయ్యాయనే హస్తం నేతలు అంటున్నారు. పరకాల సిట్టింగ్ మీూా రేవూరి ప్రకాశ్ రెడ్డికే మళ్లీ టికెట్ ఇస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనను సుస్మిత బహిరంగంగా సవాల్ చేశారు. రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్‌లోని సీనియర్ నేతలపై అవినీతి ఆరోపణలు చేశారు. ఆ అంశంపై పలువురు కాంగ్రెస్ నేతలు పీసీసీకి ఫిర్యాదు చేశారు. పీసీసీ సూచన మేరకు మల్లు రవి నేతృత్వంలోని క్రమశిక్షణా - మిగతా 2 లో

## మోదీని అడిగే దమ్ముందా?



- తెలంగాణ బీజేపీ నేతలకు పొన్నం సవాల్
- మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలని సూచన
- కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలని డిమాండ్
- తెలంగాణకు నిధుల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆరోపణ
- ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్



### బీసీ మహిళ కాబట్టే
## వేటు వేశారు

- కొండా సురేఖ బర్తరఫ్ పై శ్రీనివాస్ గౌడ్
- కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలనుకోవడం దారుణమన్న శ్రీనివాస్ గౌడ్
- ఈ కఠిన నిర్ణయం వెనుక బీసీ వ్యతిరేక ఆలోచన ఉందని మండిపాటు
- ఎంతోమంది కాంగ్రెస్ నేతలు రేవంత్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని వ్యాఖ్య

**హైదరాబాద్ :**

తెలంగాణ కేబినెట్ నుంచి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయాలనే అంశంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకత్వం తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. - మిగతా 2 లో

## ఇంగ్లండ్ తీరంలో పురాతన అగ్నిపర్వతం

- 45 కోట్ల ఏళ్ల నాటి రహస్యం వెలుగులోకి!
- ఇంగ్లండ్ తూర్పు తీరం కింద భారీ సూపర్‌వొల్కనోను గుర్తించిన శాస్త్రవేత్తలు
- సుమారు 45 కోట్ల సంవత్సరాల క్రితం ఇది పేలినట్లు అంచనా
- దశాబ్దాలుగా అంతుచిక్కని పురాతన బూడిద రహస్యాన్ని ఛేదించిన ఆవిష్కరణ
- 80 ఏళ్ల క్రితం సేకరించిన రాతి నమూనాల ద్వారా ఈ విషయం నిర్ధారణ
- ప్రస్తుతం ఈ అగ్నిపర్వతం పూర్తిగా చల్లబడి, ఎలాంటి ప్రమాదం లేదని వెల్లడి

భూగర్భంలో దాగి ఉన్న ఓ అద్భుతాన్ని శాస్త్రవేత్తలు ప్రపంచం ముందు ఆవిష్కరించారు. ఇంగ్లండ్ తూర్పు తీరం కింద లక్షల సంవత్సరాల క్రితం అంతరించిపోయిన ఒక అతి భారీ సూపర్‌వొల్కనో (మహా అగ్నిపర్వతం) ఆనవాళ్లను కనుగొన్నారు. ఈ అగ్నిపర్వతం ప్రస్తుతం ఉన్న ఎట్నా పర్వతం కంటే వేల రెట్లు శక్తిమంతమైనదని, - మిగతా 2 లో




## భారత ఆర్థిక వృద్ధి వల్ల ప్రపంచానికి కొత్త అవకాశాలు



- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- ఉక్రెయిన్, పశ్చిమాసియాలో ఘర్షణలకు త్వరగా ముగింపు పలకాలన్న ప్రధాని మోదీ
- భారత్, బెల్జియం మధ్య కీలక ఒప్పందాలు

**ఢిల్లీ :**

ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక, ఆర్థిక అనిశ్చితులు కొనసాగుతున్న వేళ భారత్, బెల్జియం ద్వైపాక్షిక సంబంధాలను మరింత వ్యూహాత్మక స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించాయి. ప్రధాని నరేంద్ర మోదీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ మధ్య గురువారం విస్తృత చర్చలు జరిగాయి. అందులో వాణిజ్యం, రక్షణ, కీలక ఖనిజాలు, క్లీన్ ఎనర్జీ, అధునాతన సాంకేతికత వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. రెండు దేశాల - మిగతా 2 లో



### టీటీడీ డిప్యూటీ ఈవో
## లోకనాథం అరెస్టు


- ఇంట్లో రూ.5 కోట్ల విలువైన ఆస్తులు గుర్తింపు
- లోకనాథం ఇల్లు, కార్యాలయాల్లో ముగిసిన ఏసీబీ సోదాలు
- టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం అరెస్టు
- నెల్లూరు ఏసీబీ కోర్టులో లోకనాథంను హాజరుపరచనున్న ఏసీబీ


**అమరావతి :**

టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథాంను ఏసీబీ అధికారులు గురువారం అరెస్టు చేశారు. బుధవారం ఉదయం నుంచి - మిగతా 2 లో

## భారత్‌కు మరో వాతావరణ ముప్పు

- 2027 వరకు ఎల్‌నినో.. డబ్ల్యూఎంఓ సంచలన హెచ్చరిక
- 2026 చివరికి తీవ్ర స్థాయికి చేరే అవకాశం
- పసిఫిక్ సముద్రంలో అసాధారణ వేడి
- భారత్‌లో ఇప్పటికే 16 శాతం వర్షపాతం లోటు
- దేశంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం
- వ్యవసాయం, నీటి వనరులపై ఒత్తిడి ముప్పు




### అక్టోబర్ నెలలోనే
## స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు



- రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- రాష్ట్ర మంత్రులతో సమావేశమైన నారా లోకేశ్
- స్థానిక ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తి లేదని వెల్లడి
- ఈ ఎన్నికలను వాయిదా వేయించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని విమర్శ

**అమరావతి :**

రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పనితీరుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందిన - మిగతా 2 లో

## అమరావతి సంగమం నిర్మాణానికి రూ.759.79 కోట్లు

- ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలివే
- ముగిసిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
- 31 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- రైతులకు ఆర్థిక చేయూతపై కేబినెట్‌లో కీలక ప్రతిపాదనలు
- 'అమరావతి సంగమం' నిర్మాణానికి రూ.759 కోట్ల 79 లక్షల పరిపాలనా అనుమతి ప్రతిపాదనపై కేబినెట్ నిర్ణయం



**అమరావతి :**

31 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ మీటింగ్‌లో రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించారు. రైతులు, మత్స్యకారులు, అమరావతి, సాగునీరు, విద్యుత్, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.అలాగే రైతులకు ఆర్థిక చేయూతపై కేబినెట్‌లో కీలక ప్రతిపాదనలు జరిగాయి. తోతాపురి మామిడికి మద్దతు ధర కోసం మార్క్‌ఫెడ్‌కు రూ.281 కోట్ల నిధులు సమకూర్చుకునే ప్రతిపాదన, పొగాకు రైతులకు ఐదీు ద్వారా రూ.94 కోట్ల ఆర్థిక సాయం అంశాలు కేబినెట్ ముందుకు వచ్చాయి. మత్స్యరంగాన్ని ప్రోత్సహించేలా రిజర్వాయర్ కేజ్ కల్చర్ పాలసీ-2026 ముసాయిదాకు ఆమోదం తెలిపింది.' అమరావతి సంగమం' నిర్మాణానికి రూ.759 కోట్ల 79 లక్షల పరిపాలనా అనుమతి ప్రతిపాదనపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అమరావతిలో సిమెంట్ కాంక్రీట్ రోడ్ల స్థానంలో బీటీ రోడ్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనపైనా చర్చ జరిగింది. అమరావతి రైల్వే కనెక్టివిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు పనులపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శాఖమూరులో స్టేట్ పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, గుడ్ గవర్నెన్స్ సంస్థలతో 'అమరావతి సంగమం' - మిగతా 2 లో

# సంపాదకీయం

## అమెరికా ఘోర తప్పిదం

గత నెల రోజులుగా ప్రశాంతంగా వున్న పశ్చిమాసియాలో మళ్లీ చిచ్చురేగింది. తాజాగా అమెరికా మొదలెట్టిన క్షిపణి దాడులు, ఇరాన్ సాగిస్తున్న ప్రతిదాడులతో అది భగ్గున మండుతోంది. దక్షిణ ఇరాన్‌లోని సిరిక్ ప్రాంతంలో పెళ్లి వేడుకలు జరుగుతున్న ఇంటిపై అమెరికా క్షిపణి పడి అయిదుగురు ప్రాణాలు కోల్పోయారు. వేరేచోట జరిగిన దాడిలో నలుగురు ఇరాన్ రెవల్యూషనరీ గార్డులు చనిపోయారు. ఈ దాడులకు ప్రతీకారంగా గల్ఫ్, జోర్డాన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేసింది. ఇజ్రాయెల్‌తో కలిసి అకారణంగా తానే ప్రారంభించిన ఈ యుద్ధంలో అమెరికా సర్వభ్రష్టమైంది. దీన్నుంచి బయటపడటానికి చేసిన యత్నాలన్నీ విఫలంకాగా... ప్రపంచ దేశాలతో ఇరాన్ ఆర్థిక లావాదేవీలన్నిటినీ 'కనీవినీ ఎరుగని రీతిలో' దెబ్బతీసే ఆర్థిక దిగ్బంధం ప్రారంభించామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించి వారం రోజులవుతుండగా తాజా దాడులు మొదలయ్యాయి. రోజులు మారాయని, తన ఆధిపత్య విధానాలకు కాలం చెల్లిందని అమెరికా గ్రహించుకోలేక ఈ నిరర్థక యుద్ధానికి తెరలేపింది. ఇది సోవియెట్‌తో పోటీపడుతూ ఆధిక్యత సాధించటానికి ప్రయత్నించిన '60ల, '70ల కాలం కాదు. సోవియెట్ పతనం తర్వాత కొన్నాళ్లపాటు సాగిన ఏకధ్రువ ప్రపంచం కూడా కాదు. కనీసం ట్రంప్ తొలి ఏలుబడినాటి పరిస్థితులు కూడా ఇప్పుడు లేవు. ఇరాన్ ఆర్థిక దిగ్బంధం గురించి గత నెల 25న ట్రంప్ ప్రకటన చేసిన వెనువెంటనే చైనా, ఖతార్‌లు ఈ చట్టవిరుద్ధ, ఏకపక్ష ఆంక్షల్ని గుర్తించదల్చుకోలేదని చెప్పడాన్ని బట్టే వర్తమాన పరిస్థితులేమిటో అర్థమవుతాయి. ఉక్రెయిన్ యుద్ధంలో పీకల్లోతు మునిగిన రష్యా కూడా ఈ ఆంక్షల్ని పాటించే స్థితిలో లేదు.అమెరికా ఆంక్షల వల్ల 2018లో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కొంతమేర దెబ్బతిన్న మాట వాస్తవమే. కానీ దాన్ని పూర్తిస్థాయిలో ధ్వంసం చేయటం, చమురు ఎగుమతుల్ని సంపూర్ణంగా నిలిపేయటం అమెరికాకు సాధ్యం కాలేదు. కనీసం అప్పుడున్న అంతర్జాతీయ, ప్రాంతీయ పరిస్థితులు ఏదోమేర ఆంక్షలు అమలుకు దోహదపడ్డాయి. అప్పట్లో సౌదీ, యూఏఈ, బహ్రైన్, ఈజిప్టులు ఖతార్‌తో సంబంధాలు తెంచుకున్నాయి. కువైట్, ఒమన్‌లు మాత్రం దానితోనే కలిసి నడిచాయి. కానీ 2021 తర్వాత ఈ పరిస్థితి మారింది. ఎడమొహం, పెడమొహంగా ఉండే సౌదీ, ఇరాన్‌లు సంబంధాలు పునరుద్ధరించు కున్నాయి. ప్రాంతీయంగా గల్ఫ్ దేశాలన్నిటిమధ్యా ఇప్పుడు అవగాహన కుదిరింది. నిరుడు సెప్టెంబర్ 9న దోహాపై ఇజ్రాయెల్ సాగించిన దాడి వీటి కళ్లు తెరిపించింది. ఇజ్రాయెల్, అమెరికాలు ఇరాన్‌పై మొదలెట్టిన యుద్ధాన్ని గల్ఫ్ దేశాలు వ్యతిరేకించక పోవచ్చుగానీ... పాలస్తీనా ఏర్పాటుకు అనువైన రాజకీయ పరిష్కారం దొరికే వరకూ ఇజ్రాయెల్‌తో సాధారణ సంబంధాలు అసాధ్యమని సౌదీ స్పష్టంగా తేల్చిచెప్పింది. ఈలోగా ఆంక్షల్ని అధిగమించటానికి అంతర్జాతీయంగా ఇరాన్ ఇప్పటికే ఏర్పర్చుకున్న నెట్‌వర్క్ అమెరికా ఆటల్ని సాగనివ్వటంలేదు. తాజా పరిణామాలన్నీ గల్ఫ్ దేశాల కళ్లు తెరిపించాయి. అమెరికాకు స్వప్రయోజనాలు తప్ప తమ భద్రత గురించి పట్టదని వాటికి అర్థమైంది. సైనిక స్థావరాలకు అమెరికాను అనుమతించినప్పుడు గల్ఫ్ దేశాల ఆలోచన వేరు. ఆ స్థావరాలుంటే ఎవరూ తమవైపు కన్నెత్తిచూడబోరని అవి అమాయకంగా విశ్వసించాయి. కానీ తనపై దాడి జరిగినప్పుడల్లా ఇరాన్ చేస్తున్న ప్రతీకార దాడులతో ఆ స్థావరాల సంగతటుంచి, తమ మౌలిక సదుపాయాలు ధ్వంసమవుతున్నాయని గల్ఫ్ దేశాలు లబోదిబోమంటున్నాయి. ఈమధ్య మూడు సౌదీ కంపెనీలు షేర్ల జారీకి ప్రయత్నించి, తాజా దాడులతో ఆ ప్రతిపాదనను పక్కనబెట్టాయి. యూఏఈ శాఖను ప్రారంభించదల్చుకున్న ప్రముఖ సంస్థ విన్ రిసార్ట్స్ ఆ ఆలోచనకు స్వస్తి చెప్పింది. వివిధ ప్రభుత్వ విభాగాలకు ఖతార్ నిధులు కత్తిరించింది. ఎఫ్ 1 రేసులు, పలు సదస్సులు, వేలాదిమంది హాజరయ్యే దోహా ఫోరం, క్రిప్టో సదస్సు వంటివన్నీ ఆర్నెల్లుగా మూలనబడ్డాయి. రియల్ ఎస్టేట్ స్తంభించింది. వేలాదిమంది అమెరికన్లు వీటన్నిటా పెట్టుబడులు పెట్టి దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తమ ఆర్థికవ్యవస్థల గురించి లేశమాత్రమైనా ఆలోచించకుండా ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు గల్ఫ్ దేశాలను కలవరపరుస్తోంది. అందుకే ఇప్పటికైనా ట్రంప్ తన పోకడలకు స్వస్తిచెప్పాలి.

## అమరావతి సంగమం నిర్మాణానికి రూ.759.79 కోట్లు

మొదటిపేజీ తరువాయి - నిర్మాణం చేపట్టనున్నారు. సాగునీరు, వరద పునరుద్ధరణకు సంబంధించి కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 78 పనులకు రూ.6 కోట్ల24 లక్షలకు పైగా పరిపాలనా ఆమోదం, వ్యయానికి అనుమతిపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది.వెలిగొండ టన్నెల్-2లో ఎదీవీ తొలగింపు పనులకు రూ.11కోట్ల 63 లక్షల మంజూరుపైనా ఆమోదం తెలిపింది. కాలువల నిర్వహణ, సాగునీటి హక్కులకు సంబంధించిన అంశాలపైనా చర్చ జరిగింది. విద్యుత్ రంగంలో ఏపీ ట్రాన్స్‌కో మధ్యకాలిక రుణానికి రూ.950 కోట్ల ప్రభుత్వ గ్యారంటీ, సీలేరు కాంప్లెక్స్‌లో ఏపీ జెన్‌కోకు ఫైర్ ప్రికాషనరీ ఫీజు మినహాయింపు ప్రతిపాదనలు కేబినెట్ పరిశీలనకు వచ్చాయి.ఓక్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులో 800 మెగావాట్ల కేటాయింపు రద్దు, విండ్ సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టులో సామర్థ్యాల మార్పిడిపైనా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇర్రాణజూ రుణాలకు సంబంధించి జెన్‌కోకు కార్పొరేట్ గ్యారంటీలు ఇచ్చేందుకు అనుమతిపైనా చర్చించింది. పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి, వివిధ ప్రభుత్వ సంస్థలకు భూ కేటాయింపులు, మార్కాపురంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణం, కడప జిల్లాలో ఏవీ-కుసుమ్ కింద సోలార్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలపైనా మంత్రివర్గం చర్చించి నిర్ణయాలు తీసుకుంది.

## క్రెడిట్ కొట్టేసేందుకే కూటమి ప్రభుత్వం స్టంట్లు

మొదటిపేజీ తరువాయి - ధ్వజమెత్తారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం కొత్తగా పనులేమీ చేపట్టకుండా, కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమవుతోందని విమర్శించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు.పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ, వాటిని పోలవరం ప్రాజెక్టు జలాలుగా చూపిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రచారం చేసుకుంటున్నారని జగన్ విమర్శించారు. పురుషోత్తపట్నం పంపులు కానీ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ కానీ ప్రస్తుత ప్రభుత్వం నిర్మించినవి కావని ఆయన స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే పోలవరం ఎడమ కాలువకు సంబంధించి 79 శాతం పనులు పూర్తయ్యాయని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.క్షేత్రస్థాయిలో కొత్తగా ఎటువంటి పనులు చేపట్టకుండా, గతంలో పూర్తయిన ప్రాజెక్టుల ద్వారా లబ్ధి పొందాలని ప్రభుత్వం ఆరాటపడుతోందని జగన్ ఆక్షేపించారు. ప్రజాధనంతో ప్రాజెక్టుల వద్ద ప్రచార కార్యక్రమాలు, పబ్లిసిటీ స్టంట్లు నిర్వహించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు.

## ఇంగ్లండ్ తీరంలో పురాతన అగ్నిపర్వతం



మొదటిపేజీ తరువాయి - సుమారు 45.4 కోట్ల సంవత్సరాల క్రితం ఇది బద్దలైందని పరిశోధకులు వెల్లడించారు. అంటే.. భూమిపై డైనోసార్లు సంచరించడానికి దాదాపు 20 కోట్ల ఏళ్ల ముందే ఈ భారీ విస్ఫోటనం సంభవించింది. ఈ పేలుడు వేల హైడ్రోజన్ బాంబులు విడుదల చేసే శక్తితో సమానమని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ సంచలన ఆవిష్కరణకు సంబంధించిన వివరాలను బీబీసీ తన కథనంలో వెల్లడించింది.దశాబ్దాలుగా నార్వే, స్వీడన్, బెలారస్, పోలాండ్ వంటి ఉత్తర యూరప్ దేశాల్లోని పురాతన శిలల పొరల్లో 'కిన్నెకుల్లె టెఫ్రా' అని పిలిచే అగ్నిపర్వత బూడిద నిక్షేపాలు శాస్త్రవేత్తలకు కనిపిస్తున్నాయి. ఇంత విస్తారంగా బూడిదను వెదజల్లిన అగ్నిపర్వతం ఎక్కడుందో గుర్తించడం వారికి పెద్ద సవాలుగా మారింది. తాజాగా బ్రిటిష్ జియోలాజికల్ సర్వే (బీజీఎస్), ఓస్లో విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తల బృందం చేసిన పరిశోధన ఈ మిస్టరీకి తెరదించింది. ఇంగ్లండ్‌లోని నార్ఫోక్, లింకన్‌షైర్ ప్రాంతాల కింద, 'ది వాష్' అని పిలిచే సముద్ర తీర ప్రాంతంలో ఈ సూపర్‌వాల్కనో కేంద్రీకృతమై ఉందని వారు నిర్ధారించారు.ఈ ఆవిష్కరణ కోసం శాస్త్రవేత్తలు సుమారు 80 ఏళ్ల క్రితం పరిశోధనల కోసం తవ్విన బోర్‌వెల్స్ నుంచి సేకరించిన రాతి నమూనాలను మళ్లీ పరిశీలించారు. వందల మీటర్ల లోతు నుంచి తీసిన ఈ నమూనాల్లోని జిర్కాన్, అపటైట్ వంటి సూక్ష్మ స్ఫటికాలను విశ్లేషించడం ద్వారా అగ్నిపర్వతం యొక్క మూలాన్ని కనుగొన్నారు.ఈ ఆవిష్కరణపై బీజీఎస్‌కి చెందిన డాక్టర్ టిమ్ ఫారో మాట్లాడుతూ.. "ఇది ఒక అద్భుతమైన ఫలితం. ఇంగ్లండ్ యొక్క పురాతన భూగర్భ చరిత్రపై మాకున్న అవగాహనను ఇది పూర్తిగా మార్చేస్తుంది" అని వ్యాఖ్యానించారు.బ్రిస్టల్ యూనివర్సిటీకి చెందిన అగ్నిపర్వత నిపుణురాలు ప్రొఫెసర్ జెన్నీ బార్న్స్ కూడా ఈ పరిశోధనను ప్రశంసించారు. "యూకే భూగర్భ చరిత్రను అర్థం చేసుకోవడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు. నీరు, ఖనిజాలు వంటి సహజ వనరుల వినియోగంలో భూగర్భ నిర్మాణం ప్రాముఖ్యతను ఇది తెలియజేస్తుంది" అని ఆమె పేర్కొన్నారు.సాధారణంగా 1,000 క్యూబిక్ కిలోమీటర్ల కంటే ఎక్కువ పదార్థాన్ని బయటకు వెదజల్లే అగ్నిపర్వతాలను 'సూపర్‌వాల్కనోలు' అంటారు. అమెరికాలోని యెల్లోస్టోన్, ఇండోనేషియాలోని టోబా సరస్సు వంటివి ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న కొన్ని సూపర్‌వాల్కనోలు. అయితే, ఇంగ్లండ్‌లో గుర్తించిన ఈ అగ్నిపర్వతం కోట్ల సంవత్సరాల క్రితమే చల్లబడి, శిలలు, అవక్షేపాల పొరల కింద సురక్షితంగా ఉందని, దీనివల్ల భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదం లేదని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఇది కేవలం బ్రిటిష్ దీవుల యొక్క తీవ్రమైన భౌగోళిక గతాన్ని తెలిపే ఒక చారిత్రక ఆనవాలు మాత్రమేనని వివరించారు.

## అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు

మొదటిపేజీ తరువాయి - ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్ నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని లోకేశ్ తేల్చి చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తోందని తెలిపారు. మొదట పురపాలక (మున్సిపల్), ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో జరుగుతాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చాలనే లక్ష్యంతో వైసీపీ ఆడుతున్న 'గొడ్డలి రాజకీయాల' కుయుక్తులు ఎంతమాత్రం సాగవని మండిపడ్డారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు.మరోవైపు విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే, మాట వినని అధికారులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా... ఆనాటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యలతో అధిగమించాలని మంత్రులకు సూచించారు.

## బీసీ మహిళ కాబట్టే వేటు వేశారు

మొదటిపేజీ తరువాయి -

ఒక బీసీ మహిళా మంత్రిని పదవి నుంచి తొలిగించాలనుకోవడం దారుణమని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 1000 రోజుల పాలనకు నిరసనగా నారాయణపేట జిల్లా కోస్గిలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన 'బీఆర్ఎస్ రైతు గర్జన' సభలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు నిత్యం ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా బహిరంగంగానే మాట్లాడుతున్నారని, కానీ కేవలం ఓ బీసీ మహిళా నాయకురాలిని మాత్రమే లక్ష్యంగా చేసుకుని పదవి నుంచి తొలగించడం కాంగ్రెస్ వైఖరికి అద్దంపడుతోందని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. సొంత పార్టీ మంత్రుల్లో కొందరికి ఒక న్యాయం, కొండా సురేఖకు మరొక న్యాయమా? అని నిలదీశారు. ప్రస్తుత కేబినెట్‌లోని పలువురు మంత్రులపై అవినీతి, కమీషన్ల ఆరోపణలు వెల్లువెత్తుతున్నా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోని ప్రభుత్వం, సురేఖ విషయంలో మాత్రం ఇంత కఠినంగా వ్యవహరించడం వెనుక బీసీ వ్యతిరేక ఆలోచనా ధోరణి ఉందని ధ్వజమెత్తారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలను అనేక రకాలుగా మోసం చేస్తూ వస్తోందని, పదవుల తొలగింపులోనూ బడుగు, బలహీన వర్గాల నేతలనే బలిపశువులను చేస్తున్నారని విమర్శించారు. కొండా సురేఖ ఉద్వాసన కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయమైనప్పటికీ, ఒక బలమైన బీసీ నాయకురాలికి జరిగిన ఈ అన్యాయాన్ని ప్రజలు, బీసీ వర్గాలు గమనిస్తున్నాయని అన్నారు.

## భారత ఆర్థిక వృద్ధి వల్ల ప్రపంచానికి కొత్త అవకాశాలు

మొదటిపేజీ తరువాయి - మధ్య సహకారాన్ని మరింత విస్తరించేందుకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ ప్రపంచ పరిస్థితులు, భారత్ ఆర్థిక ప్రగతి, శాంతి-భద్రత వంటి అంశాలపై మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచం తీవ్ర మార్పులు, అనిశ్చితితో కూడిన పరిస్థితులను ఎదుర్కొంటోందని అన్నారు. ఆహారం, ఇంధనం, సరఫరా వ్యవస్థల నుంచి దాదాపు ప్రతి రంగంపైనా అంతర్జాతీయ పరిణామాల ప్రభావం పడుతోందని మోదీ పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ తన వేగాన్ని కొనసాగిస్తోందని చెప్పారు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసిందని వెల్లడించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ వృద్ధి కొనసాగడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. దేశ ఆర్థిక ప్రగతి ఇప్పుడు ప్రపంచానికి విశ్వాసాన్ని కలిగించడంతో పాటు కొత్త అవకాశాలకు దారితీస్తోందని మోదీ అన్నారు.ఇక ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధాలు, ఉద్రిక్తతలపైనా ఇరువురు నేతలు చర్చించారు. ఉక్రెయిన్, పశ్చిమాసియా ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై భారత్ వైఖరిని మోదీ మరోసారి స్పష్టం చేశారు. అంతర్జాతీయ వివాదాలకు చర్చలు, దౌత్యం, న్యాయపాలన ఆధా ంగా పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు. ఉక్రెయిన్ లేదా పశ్చియాసియా అయినా ఘర్షణలు త్వరగా ముగిసి శాంతి నెలకొనేందుకు చేపట్టే ప్రయత్నాలకు భారత్?, బెల్జియం మద్దతు ఇస్తాయని తెలిపారు. ఉగ్రవాదంపై కూడా ఇరుదేశాలు ఒకే వైఖరిని కలిగి ఉన్నాయని మోదీ చెప్పర్ను. ఉగ్రవాదాన్ని ఏ రూపంలో ఉన్నా నిర్మూలించేందుకు కలిసి పనిచేయడం రెండు దేశాల ఉమ్మడి బాధ్యతగా పేర్కొన్నారు.అధునాతన సాంకేతిక రంగంలోనూ భారత్, బెల్జియం మధ్య సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని ప్రధాని మోదీ చెప్పారు. ముఖ్యంగా సెమీకండక్టర్ రంగంలో బెల్జియం సాంకేతిక నైపుణ్యం, భారత్ వద్ద ఉన్న విస్తృత స్థాయి ఉత్పత్తి సామర్థ్యం ఒకదానికొకటి అనుకూలంగా ఉంటాయని పేర్కొన్నారు. రక్షణ రంగంలోనూ భాగస్వామ్యాన్ని పెంచుకునేందుకు ఇరుదేశాలు ఆసక్తి చూపాయి. ఆధునిక రక్షణ సాంకేతికత పరికరాల తయారీ, పరిశ్రమల మధ్య భాగస్వామ్యానికి అవకాశాలను అన్వేషించున్నాయి. భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం రెండు దేశాల సంబంధాలకు కొత్త అవకాశాలను తెరుస్తుందని బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ అన్నారు. భారత్, యూరప్ మధ్య ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతం కావడానికి ఈ ఒప్పందం కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. భారత్, యూరోపియన్ యూనియన్ ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య శక్తుల్లో రెండుగా ఉన్నాయని మోదీ గుర్తుచేశారు. రెండు పక్షాల మధ్య పెరుగుతున్న సహకారం ప్రపంచ స్థిరత్వం, ఆర్థిక వృద్ధి, ఉమ్మడి అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు.బార్ట్ డి వెవర్ మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా భారత్‌కు వచ్చారు. 2025 ఫిబ్రవరిలో బెల్జియం ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన భారత్‌కు రావడం ఇదే తొలిసారి. అంతేకాదు దాదాపు రెండు దశాబ్దాల తర్వాత బెల్జియం ప్రధానమంత్రి భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. బెల్జియం రక్షణ, విదేశీ వాణిజ్య మంత్రి థియో ఫ్రాంకెన్‌తో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, వ్యాపార ప్రముఖులతో కూడిన ప్రతినిధి బృందం వచ్చింది. బెల్జియం రక్షణ పరిశ్రమకు చెందిన ప్రతినిధులు కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు.

## భారత్‌కు మరో వాతావరణ ముప్పు

మొదటిపేజీ తరువాయి -

వాతావరణ మార్పులపై 'ప్రపంచ వాతావరణ సంస్థ' (డబ్ల్యూఎంఓ) కీలక హెచ్చరిక చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ప్రభావం వేగంగా బలపడుతోందని తెలిపింది. ఈ ఏడాది చివరి నాటికి ఇది చాలా తీవ్ర స్థాయికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది. అంతేకాదు.. ఎల్‌నినో ప్రభావం 2027 ఫిబ్రవరి వరకు కొనసాగేందుకు 100 శాతం అవకాశం ఉందని తాజా అంచనాలో వెల్లడించింది.సెప్టెంబర్ 3న విడుదల చేసిన తాజా నివేదికలో డబ్ల్యూఎంవో ఇంతటి అధిక స్థాయి విశ్వాసంతో ఎల్‌నినో కొనసాగింపుపై అంచనా వేయడం ఇదే తొలిసారి. పసిఫిక్ సముద్ర ఉపరితలంతో పాటు లోతైన జలాల్లోనూ అసాధారణంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవి ఎల్‌నినో మరింత బలపడేందుకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి.ఎల్‌నినో అనేది మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో సముద్ర జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కే సహజ వాతావరణ ప్రక్రియ. దీని ప్రభావం పసిఫిక్ ప్రాంతానికే పరిమితం కాదు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతల తీరును మార్చగలదు.ఎల్‌నినోను పర్యవేక్షించే కీలక ప్రాంతమైన నినో 3.4లో మే నుంచి జులై 2026 వరకు సముద్ర ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉన్నాయి. జులైలో ఈ తేడా 2 డిగ్రీలకు చేరింది. జులై చివరి నుంచి ఆగస్టు మధ్య వరకు వారపు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2.2 నుంచి 2.6 డిగ్రీల వరకు ఎక్కువగా నమోదయ్యాయి.సముద్రం అడుగుభాగంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. జులై, ఆగస్టు ప్రారంభంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే 8 డిగ్రీల సెల్సియస్ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో 2026 చివరి నాటికి ఎల్‌నినో చాలా బలమైన స్థాయికి చేరుకోవచ్చని డబ్ల్యూఎంఓ అంచనా వేస్తోంది.ఎల్‌నినో ప్రభావం అన్ని దేశాల్లో ఒకేలా ఉండదు. అయితే భారత్‌కు ఇది కీలకమైన వాతావరణ సంకేతం. సాధారణంగా ఎల్‌నినో బలపడిన సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉంటుంది. ఫలితంగా వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడొచ్చు.భారత్‌లో 2026 నైరుతి రుతుపవనాలపై భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఇప్పటికే ఆందోళనకర అంచనా ఇచ్చింది. మేలో విడుదల చేసిన అంచనాలో సీజన్ మొత్తం వర్షపాతం దీర్ఘకాల సగటులో 90 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం 60 శాతంగా అంచనా వేసింది.ఎల్‌నినో బలపడటంతో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో తీవ్రమైన వేడి, కరవు, వరదల ముప్పు పెరగొచ్చని డబ్ల్యూఎంఓ హెచ్చరిస్తోంది. సెప్టెంబర్-నవంబర్ మధ్య దాదాపు అన్ని భూభాగాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అయితే వర్షపాతం మాత్రం ప్రాంతాన్ని బట్టి మారుతుందని తెలిపింది.భారత్‌పై ఎల్‌నినో ప్రభావాన్ని ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఈ సమయంలో పాజిటివ్ ఐఓడీ ఏర్పడే అవకాశం ఉందని అంచనా. దీంతో ఎల్‌నినో వల్ల భారత్‌లో సాధారణంగా కనిపించే ప్రభావాల్లో కొంత మార్పు రావొచ్చని నిపుణులు చెబుతున్నారు.ఎల్‌నినో 2027 ప్రారంభం వరకు కొనసాగితే దాని ప్రభావం ఒక్క సీజన్‌కే పరిమితం కాకపోవచ్చు. వ్యవసాయం, ఆరోగ్యం, విద్యుత్, నీటి వనరుల వంటి వాతావరణంపై ఆధారపడే రంగాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.అందుకే ప్రభుత్వాలు, వాతావరణ సంస్థలు ముందస్తు హెచ్చరికలు, విపత్తు సన్నద్ధత చర్యలను మరింత బలోపేతం చేయాలని డబ్ల్యూఎంఓ సూచిస్తోంది.ఎల్‌నినో సహజమైన వాతావరణ చక్రంలో భాగమే. అయితే ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరుగుతున్న సమయంలో ఇది మరింత ఒత్తిడిని పెంచే అవకాశం ఉందని డబ్ల్యూఎంఓ హెచ్చరిక స్పష్టం చేస్తోంది.

## టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం అరెస్టు

మొదటిపేజీ తరువాయి -

లోకనాథం ఇల్లు, కార్యాలయాల్లో చేపట్టిన ఏసీబీ సోదాలు ముగిసిన నేపథ్యంలో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. నెల్లూరు ఏసీబీ కోర్టులో లోకనాథంను ఏసీబీ అధికారులు హాజరుపరచనున్నారు.టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథంకు సంబంధించిన వసతిగృహంతో పాటు, తిరుపతిలోని లోకనాథం ఇద్దరు బావమరుదులు మునికృష్ణ, రమేశ్ ఇళ్లతో పాటు, ఏర్పేడు మండలంలోని అతని సోదరుడి నివాసాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. తొలిరోజు లోకనాథం సోదాల్లో ప్రభుత్వ ధర ప్రకారం 5 కోట్ల ఆస్తులను గుర్తించారు. మార్కెట్ ధర ప్రకారం ఇది ఇంకా చాలా ఎక్కువే ఉండొచ్చు.తిరుపతితో పాటు ఆయన బంధువుల ఇళ్లపై ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఈ క్రమంలో లోకనాథం ఇంట్లో 2 కిలోల బంగారం, 6.5 కిలోల వెండి, రూ.12 లక్షల నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లోకనాథం, కుమారుడి పేరిట 4 ఫిక్స్‌డ్ డిపాజిట్లు, తిరుపతి శ్రీనివాసనగర్‌లో ఫ్లాట్, గొల్లవానిగుంటలో 2 ఇళ్లు, వడమాలపేట మండలం పాదిరేడులో ఒక ఇల్లు కొనుగోలు చేసినట్లు ఏసీబీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కల్తీ నెయ్యి కేసులో మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు చిన్నఅప్పన్న విచారణలో వెల్లడైన పలు అంశాలు ఆధారంగా లోకనాథంపై కేసు నమోదు చేశారు. దాదాపు దశాబ్దం తర్వాత టీటీడీ ఉద్యోగి నివాసంలో ఏసీబీ సోదాలు జరగడం గమనార్హం. 2016లోనూ డిప్యూటీ ఈవోగా ఉన్న భూపతిరెడ్డి, ఆయన సోదరులు, బంధువుల ఇళ్లలో తనిఖీలు చేశారు.కారుణ్య నియామకంతో జూనియర్ అసిస్టెంట్‌గా: 1989 ఫిబ్రవరి 1న కారుణ్య నియామకం కింద లోకనాథం టీటీడీలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్, అసిస్టెంట్ ఈవోగా ఉద్యోగోన్నతి పొందారు. 2023 ఏప్రిల్ నుంచి శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవోగా తిరుమలలో పనిచేస్తున్నారు. అంతకుముందు తిరుచానూరులో విధులు నిర్వర్తించారు. గతేడాది తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయానికి బదిలీ వచ్చినా, శ్రీవారి ఆలయానికి నియమితులైన టీటీడీ అధికారి వైఎస్సార్సీపీకి అనుకూలురని ఆరోపణలు రావడంతో బదిలీలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఈ క్రమంలో లోకనాథం డిప్యూటీ ఈవోగా కొనసాగుతున్నారు. ఏసీబీ అధికారులు బుధవారం తిరుమలలోని బీటైప్ క్వార్టర్స్‌లో ఉన్న ఆయన గదిని ఆధీనంలోకి తీసుకున్నప్పటికీ సోదాలు చేయలేదు.

## కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయండి



మొదటిపేజీ తరువాయి - కమిటీ ఆ విషయంపై దృష్టిసారించింది.సుస్మిత వ్యాఖ్యలపై పూరిస్థాయిలో విచారణ చేయాలని మల్లు రవిని, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆదేశించగా కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. సుస్మిత వ్యాఖ్యలపై వివరణ తీసుకున్నారు. తన కుమార్తె స్వతంత్ర మహిళ అని పేర్కొన్న కొండా సురేఖ.. ఆ వ్యాఖ్యలకు తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఆ వ్యాఖ్యలకి తాను బాధ్యురాలిని కాదని క్రమశిక్షణా కమిటీ ముందు వివరణఇచ్చారు. తనపై అవినీతి ఆరోపణలు లేవి సురేఖ వివరణ ఇచ్చినా.. క్రమశిక్షణా కమిటీ సంతృప్తి చెందలేదు. సుస్మిత వ్యాఖ్యలు పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిందని తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానించి నివేదికను ఢిల్లీకి పంపింది.తరువాత ఢిల్లీ వేదికగా హైడ్రామా సాగింది. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ హస్తినలో పార్టీ హైకమాండ్?తో సమావేశమయ్యారు. పార్టీలో క్రమశిక్షణే ముఖ్యమని కఠిన చర్యలు తీసుకోకపోతే పార్టీలో తిరుగుబాట్లు పెరుగుతాయని అధిష్ఠానం పెద్దలకు నివేదించారు. ఢిల్లీ వెళ్లిన కొండా సురేఖ కూడా ఖర్గేను కలిసి తన వాదన వినిపించారు.తాను బీసీ సామాజికవర్గానికి చెందిన వారమని తమ కుటుంబానికి పెద్ద ఓటుబ్యాంక్ ఉందని చెప్పుకొచ్చారు. అయినా శాంతించని హైకమాండ్ రాజీనామా చేయాలని స్పష్టంచేసింది. సురేఖ అందుకు అంగీకరించకపోవటంతో సీఎం రేవంత్ నేరుగా కొండా సురేఖను బర్తరఫ్ చేయాలని సిఫార్సు చేస్తూ గవర్నర్‌కి లేఖ పంపారు.రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘారెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి.చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద నియమితులయ్యారు.

## మోదీని అడిగే దమ్ముందా?



మొదటిపేజీ తరువాయి - తెలంగాణలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు.తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత తెలంగాణ బీజేపీ నేతలపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు.బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు.గతంలో పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు.తెలంగాణకు సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. తెలంగాణకు పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

# తెలంగాణలో సంక్షేమ విద్యార్థులకు సకల సౌకర్యాలు

**వారంలో ఒకసారి ప్రభుత్వ పాఠశాలను తహసిల్దార్, ఎంపీడీవోలు తనిఖీ చేయాలి..**

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్..**





**గొల్లపల్లి సెప్టెంబర్ 03ప్రజా మంటలు :** రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి లక్ష్యం అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ. 67 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజనం చేసిన మంత్రి విద్యార్థులకు షూస్ తోపాటు బ్యాగులను అందజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మండలంలోని తహసిల్దార్, ఎంపీడీవోలు వారంలో ఒకరోజు ప్రభుత్వ పాఠశాలను, సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు పరిశీలించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువులో రాణించాలని మంత్రి ఈ సందర్భంగా కోరారు. రాష్ట్రంలోని సంక్షేమ శాఖ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాతో పాటు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం అని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి గారి ఆలోచన ప్రకారం రాష్ట్రంలోని సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. కుమ్మర్ పల్లి కస్తూర్బా వసతి గృహాన్ని ప్రతి నెలకు ఒకసారి సందర్శిస్తానని మంత్రి తెలిపారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా మైదానం ఏర్పాటుకు చొరవ తీసుకుంటానని మంత్రి తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువులో రాణిస్తూ మంచి మార్కులు సాధించినందుకు పాఠశాల ఉపాధ్యాయులను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జక్కుల ఆమని, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, వెల్గటూర్ తహసీల్దార్ తో పాటు పలువురు అధికారులు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## హెల్త్ కార్డులతో న్యాయవాదులకు ఎన్నో ప్రయోజనాలు

**బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రాంరెడ్డి**




**మెట్‌పల్లి, సెప్టెంబర్ 3 (ప్రజా మంటలు):** తెలంగాణ అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెన్యూవల్ చేసిన హెల్త్ కార్డులతో న్యాయవాదులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని మెట్‌పల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రాంరెడ్డి అన్నారు. గురువారం మెట్‌పల్లి బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులకు జారీ చేసిన హెల్త్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏలేటి రాంరెడ్డి మాట్లాడుతూ, హెల్త్ కార్డులు న్యాయవాదులకే కాకుండా వారి కుటుంబ సభ్యులకు కూడా వైద్య పరంగా ఎంతో ఉపయోగకరంగా ఉండటం సంతోషకరమన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి హెల్త్ కార్డులు ఎంతో దోహదపడతాయని తెలిపారు. నూతన బార్ కౌన్సిల్ సభ్యులు కొలువుదీరిన అనంతరం ప్రస్తుతం హెల్త్ కార్డులు లేని న్యాయవాదులకు కూడా కార్డులు జారీ అయ్యేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, సంయుక్త కార్యదర్శి మగ్గిడి నర్సయ్య, క్యాషియర్ బిగుల్లా శంకర్, కల్చరల్ సెక్రటరీ కాజీపేట స్రవంతితో పాటు న్యాయవాదులు జిల్లా వెంకటేశ్వర్లు, పోలకొండ దయాకర్ వర్మ, గడ్డం శంకర్ రెడ్డి, ఎలాల మధుసూదన్ రెడ్డి, పుప్పాల భానుమూర్తి, రాంపల్లి జగన్, జేడి సుధాకర్, నేరెళ్ల శ్రీధర్, పసునూరి శ్రీనివాస్, పడిగేలా శ్రీనివాస్, వెల్మల స్వప్న రావు, అందె సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల మున్సిపాలిటీ ఎజెండాపై మాజీ కౌన్సిలర్ ఫిర్యాదు



**జగిత్యాల, సెప్టెంబర్ 3 (ప్రజా మంటలు):** జగిత్యాల మున్సిపాలిటీలో డీజిల్, వాహనాల రిపేర్లు, పండుగల ఏర్పాట్లు, వాహనాల కొనుగోళ్లు, పాత బిల్లుల చెల్లింపుల్లో ప్రజాధనం దుర్వినియోగం జరుగుతోందని మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ ఆరోపించారు. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వినాయక నిమజ్జనం, బతుకమ్మ ఏర్పాట్లకు ప్రతిపాదించిన ఖర్చులు, మొరం--డస్ట్ కొనుగోళు,, ఈవీ ఆటో టిప్పర్లు, బ్లేడ్ ట్రాక్టర్, 14 టైర్ల టిప్పర్ కొనుగోళ్లపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. గతంలో కొనుగోలు చేసిన స్వీపింగ్ మిషన్, టిప్పర్లు సక్రమంగా వినియోగించడం లేదని పేర్కొన్నారు. గత కౌన్సిల్‌కు సంబంధించిన పాత బిల్లులను ప్రస్తుత కౌన్సిల్ టేబుల్ ఎజెండాలో చేర్చి చెల్లింపులు చేయడంపైనా ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. మ్యాపింగ్ పేరుతో ప్రతిపాదించిన రూ. 25.26 లక్షల బిల్లుపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలపై గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని జయశ్రీ పేర్కొన్నారు. ఎజెండాలోని వివాదాస్పద అంశాలన్నింటిపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు ప్రతులను జగిత్యాల కలెక్టర్, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు పంపించారు.

## జెమ్స్ స్కూల్లో వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



**జగిత్యాల: సెప్టెంబర్ 3(ప్రజా మంటలు)** విజయపురి కాలనీ బైపాస్ రోడ్డులోని జెమ్స్ స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడి బాల్యలీలలు, గోకుల వాతావరణం, స్నేహం, ప్రేమ, ధర్మం, సత్యం వంటి అంశాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, భక్తిగీతాలు నిర్వహించారు. చిన్నారుల చిన్ని చిన్ని అడుగులు, మురళీధరుడి వేషధారణ, రంగురంగుల అలంకరణలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ కెంచు చిన్నన్న మాట్లాడుతూ, శ్రీకృష్ణుడి జీవితం విద్యార్థులకు ఎన్నో గొప్ప సందేశాలను అందిస్తుందని అన్నారు. కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవడం, స్నేహాన్ని గౌరవించడం, సత్యం--ధర్మం వైపు నిలబడటం, తన కర్తవ్యాన్ని నిజాయితీగా నిర్వర్తించడం వంటి విలువలను పిల్లలు అలవర్చుకోవాలని సూచించారు. పండుగలను కేవలం ఉత్సవాలుగా కాకుండా, వాటి వెనుక ఉన్న సంస్కృతి, విలువలను తెలుసుకునే అవకాశాలుగా మలచడమే జెమ్స్ స్కూల్ లక్ష్యమని తెలిపారు. ప్రిన్సిపాల్ కెంచు మల్లిక మాట్లాడుతూ, విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు, ప్రేమ, స్నేహం, దయ, క్రమశిక్షణ, ధైర్యం వంటి సద్గుణాలను పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు ఎంతో దోహదపడతాయని అన్నారు. శ్రీకృష్ణుడి బోధనలను జీవితంలో ఆచరిస్తూ మంచి పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలు, కృష్ణ--రాధ వేషధారణలు, భక్తి గీతాలు, నృత్య కార్యక్రమాలతో కృష్ణాష్టమి వేడుకలు కన్నులపండువగా, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి.

## కృష్ణవేణి స్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 03 (ప్రజా మంటలు):** సికింద్రాబాద్ బోలక్ పూర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శనలు, ఉట్టి కొట్టే కార్యక్రమం అందరినీ ఎంతగానో అలరించాయి. విద్యార్థుల ఆటపాటలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. చిన్నతనం నుంచే పిల్లలకు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆధ్యాత్మిక భావనలు అలవడేలా పాఠశాలలో ప్రతి పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మంచాల వరలక్ష్మి, కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు, విజయభాస్కర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు, కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేసింది.ం

## ఎమ్మెల్యేను కలిసిన నూతన కార్యవర్గం



**జగిత్యాల రూరల్, (ప్రజా మంటలు) సెప్టెంబర్ 03:** జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ రైతు సహకార సంఘం నూతన కార్యవర్గ సభ్యులు గురువారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి మొక్క అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షులు సంగేపు తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు గోస్కుల మహేష్ , డైరెక్టర్లు, మాజీ మార్కెట్ కమిటి ఛైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ సత్తిరెడ్డి , మాజీ సర్పంచ్ చెరుకుజాన్, నాయకులు రాజేశ్వర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, మల్లేష్ , సర్పంచులు మోహన్ రెడ్డి, శేఖర్, మల్లేష్, బాపురెడ్డి, శేఖర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి మండల నూతన కార్యవర్గం ఎన్నిక

**మండల అధ్యక్షుడిగా బండారి రాజు ఏకగ్రీవ ఎన్నిక**

**ధర్మపురి, సెప్టెంబర్ 3 (ప్రజా మంటలు):** తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ (టాజూటాజుఖ) ధర్మపురి మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఎన్నికల ప్రక్రియకు ముఖ్య పరిశీలకులుగా వీరభత్తిని శ్రీనివాస్, నరేడ్ల భూమా రెడ్డి, సందుపట్ల రమేష్ వ్యవహరించారు. మండల అధ్యక్షుడిగా బండారి రాజు, ప్రధాన కార్యదర్శిగా సందారికారి రాజేశ్, కోశాధికారిగా ఎల్పుల రాజశేఖర్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా మారంపల్లి రాజేష్, మహిళా అధ్యక్షురాలిగా చెట్టిపెల్లి రజిత బాధ్యతలు స్వీకరించారు. అసోసియేట్ అధ్యక్షులుగా నునావత్ రాజు, శీలం రాజేష్, కాశెట్టి వెంకట రమణ, మానస; ఉపాధ్యక్షులుగా కళమడుగు స్వప్న, మాదాసు అరవింద్, మండల రాజ్ కుమార్, తాటికంటి వినోద్, మహమ్మద్ అప్సర్ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా మైదం గణేష్, అప్పాల రవీందర్, నరేడ్ల సమత, గుడికందుల సంపత్, కారికూరి లక్ష్మీనారాయణ; ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సందా వెంకటేష్, బుర్ర శ్రీనివాస్, గొర్రె సునీత, దామెర గంగ నర్సయ్య ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా లకావత్ తిరుపతి, శ్రీధర మహేష్; కార్యవర్గ సభ్యులుగా సుద్దపెల్లి మధు, భైరి మల్లేష్, మైదం తిరుపతి, మాదాసు సూర్యతేజ, మహమ్మద్ బాబర్ ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా బండారి సతీష్, బెజ్జంకి నితిన్, దాసరి గంగాధర్, బొమ్మెల్ల ప్రీతి ఎన్నికయ్యారు.

## సీఎం రేవంత్ రెడ్డి నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

**రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ ఛైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి**



**హైదరాబాద్ సెప్టెంబర్ 03 (ప్రజా మంటలు):** తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్‌పర్సన్‌గా, క్యాబినెట్ మంత్రి హోదాతో తనకు కీలక బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి, రాష్ట్ర నాయకత్వానికి రుణపడి ఉంటానని గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఆమె పేర్కొన్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం, సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రివర్గానికి విజయలక్ష్మి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజల సంక్షేమం, తెలంగాణ అభివృద్ధికి మరింత అంకితభావంతో పనిచేస్తానని విజయలక్ష్మి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా, తెలంగాణ ప్రజల ఆశీస్సులతో మరింత బాధ్యతగా ముందుకు సాగుతానని తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్‌పర్సన్‌గా లభించిన అవకాశాన్ని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వినియోగించుకుంటానని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ సమగ్ర, సుస్థిర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని గద్వాల్ విజయలక్ష్మి స్పష్టం చేశారు.

## అవినీతి అభివృద్ధిపై అసెంబ్లీలో తేల్చుకుందాం రండి

**బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావు మంత్రి అడ్లూరి సవాల్..**

**ఉనికి కాపాడుకోవడానికి బీఆర్ఎస్ ప్రయత్నం..**

**వెయ్యి రోజుల ప్రోగ్రెస్ రిపోర్ట్ కొప్పుల ఈశ్వర్ కి పంపిస్తా..**

**ప్రోగ్రెస్ రిపోర్టులో తప్పులుంటే దేనికైనా సిద్ధం..**

**విలేకరుల సమావేశంలో మంత్రి లక్ష్మణ్ కుమార్..**



**గొల్లపల్లి సెప్టెంబర్ 03 ప్రజా మంటలు :** వెయ్యి రోజుల ప్రజాపాలన ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై, బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న అవినీతి ఆరోపణలపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను తీసుకురావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ సవాల్ విసిరారు. జగిత్యాల జిల్లా ధర్మపురి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరి గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 2023 డిసెంబర్ లో రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకొని ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. వెయ్యి రోజులుగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ యాస భాషతో ప్రభుత్వం పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీని ఏక వచనంతో సంబోధించడం కేటీఆర్ హరీష్ రావుల అహంకారానికి నిదర్శనమని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న టీఆర్ఎస్, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలో నాలుగు గ్యారంటీలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. మరో రెండు గ్యారెంటీలను అమలు చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఉచిత విద్యుత్తు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతోపాటు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్ళను నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంఘ భట్ట దినేష్, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, జిల్లా పార్టీ కాంగ్రెస్ కార్యదర్శి పదకొండ విజయ్, జిల్లా నాయకులు ధర్మపురి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలిమాల లక్ష్మణ్, బుగ్గారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నన్నూరి నర్సా గౌడ్,వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## నూతన సీఐ శ్రీనివాస్‌ను కలిసిన రైతు రక్షణ సమితి ప్రతినిధులు



**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 3: ప్రజా మంటలు :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి సర్కిల్‌కు నూతనంగా వచ్చిన సీఐ శ్రీనివాస్‌ను రైతు రక్షణ సమితి హనుమకొండ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐ శ్రీనివాస్ స్పందిస్తూ రైతులకు ఏదైనా సమస్య ఉంటే నేరుగా వచ్చి కలిసి వివరించాలని, చట్టపరంగా సమస్యల పరిష్కారానికి సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య సలహాదారు సుకినే సుధాకర్ రావు, మండల అధ్యక్షుడు కొక్కు తిరుపతి, ప్రధాన కార్యదర్శి కోదాటి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలు నెరవేర్చాల్సిందే

**బీఆర్ఎస్ నేతల ధ్వజం**

**బౌద్ధనగర్ డివిజన్‌లో జోరుగా బాకీ కార్డుల పంపిణీ**





**సికింద్రాబాద్, సెప్టెంబర్ 03 (ప్రజా మంటలు):** శాసనసభ ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని సంజీవపురం తదితర ప్రాంతాల్లో ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కితే ప్రజల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల వాగ్దానాలు పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు తమ ఉద్యమం విశ్రమించదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కంది నారాయణ, కంది శైలజ, సీనియర్ నేత, ఉద్యమకారుడు మంద జగన్, నాయకులు శైలేందర్, రమేష్, ప్రసాద్, జక్కా హరిబాబు, చింతకింది మల్లేష్, రాజేష్, మస్తాన్ బాబా, పాక సాయి, శీలం సాయి, కొండ కిషోర్, ఉండింటి సచిన్, వినోద్, గంగపుత్ర సాయి, బీబీ చారి, యాద క్రాంతి, మహిళా నేతలు సుమలత, సుజాత, అనసూయ గౌడ్, మానస, రేణుక, మంజుల, లత, సులోచన, సుమతి, నందిత, భవిత, సుమ, లక్ష్మి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల ప్రజాపాలన విజయోత్సవాలు ఘనంగా నిర్వహణ





**ఎల్కతుర్తి ఆగస్టు 3 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి ప్రజాపాలన వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుల ఆదేశాల మేరకు గురువారం ప్లే కార్డులతో ఎల్కతుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రజాపాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎల్కతుర్తి బస్టాండ్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద ప్రెస్‌మీట్ నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉప సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, అన్ని గ్రామ శాఖల అధ్యక్షులు, కాంగ్రెస్ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి చేరవేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. బొమ్మనపెల్లి అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన విజయవంతంగా కొనసాగుతున్న సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, ఇంద్ర సేనరెడ్డి, గోళి రాజేశ్వర్‌రావు యాదగిరి గౌడ్, సర్పంచ్ రవీందర్ గౌడ్, గొడిశాల నరేష్,బత్తిని శ్రీనివాస్ ముప్పు మహేందర్ గొడిశాల రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొడిశాల రాజయ్యగౌడ్, డాక్టర్ శ్రీనివాస్, చల్లూరి వేణు, కుర్ర ప్రకాశ్ గౌడ్ ఎల్కతుర్తి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ అంబాల జగన్ ఎల్కతుర్తి మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ శాఖల అధ్యక్షులు, సర్పంచులు, అనుబంధ విభాగాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొని ప్రజాపాలన వెయ్యి రోజుల విజయోత్సవాలను విజయవంతం చేశారు.

## గంజాయి అమ్ముతున్న బీహార్ కి చెందిన వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేసిన ఇబ్రహీంపట్నం పోలీసులు

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 3 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మెట్పల్లి డిఎస్పి రాములు సూచనల మేరకు మెట్పల్లి సీఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఎస్సై జి నవీన్ కుమార్ మరియు అతని సిబ్బందితో యుక్తంగా టీంను ఫామ్ చేసి గంజాయి అమ్ముతున్న వారిని పట్టుకునే ప్రయత్నంలో తేదీ 23.08.2026 రోజున బీహార్ రాష్ట్రానికి చెందిన సాగర్ కుమార్ తండ్రి కమల్ కిషోర్ బహార్దార్,19 సంవత్సరాలు అను వ్యక్తి ఇబ్రహీంపట్నం వైపు గంజాయి అమ్మటకు వస్తున్నాడు అనే నమ్మదగిన సమాచారం మేరకు ఆ వ్యక్తి కోసం కాపు కాస్తుండగ మెట్పల్లి నుండి ఆర్టీసీ బస్సులో ఇబ్రహీంపట్నం వచ్చిన నిందితుడు సాగర్ కుమార్ ని ఇబ్రహీంపట్నం బస్టాండ్ లో పట్టుకొని అతని విచారించ అతను నాలుగు నెలలుగా మెట్టుపల్లి పట్టణంలో ఒక రూమ్ అద్దెకి తీసుకొని అతని తండ్రి,అతని స్నేహితుడి తో కలిసి ఉంటూ రోజువారిగా హమాలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. బీహార్ నుంచి గంజాయిని తీసుకొచ్చి గత కొంతకాలంగా మెట్టుపల్లి పట్టణ పరిసర ప్రాంతాల్లో గల వ్యక్తులకు అమ్ముతున్నాడు అనీ, అదే క్రమంలో పది రోజుల క్రితం బీహార్ కి వెళ్లి ఒక కిలో గంజాయిని తీసుకొచ్చి మెట్టుపల్లి పరిసర ప్రాంతాల్లో అమ్మగా మిగిలిన 300 గ్రాముల గంజాయిని ఇబ్రహీంపట్నం మండల పరిసర ప్రాంతాల్లో అవసరం ఉన్న వ్యక్తులకు అమ్ముదామని మెట్టుపల్లి లో ఆర్టీసీ బస్సు ఎక్కి ఇబ్రహీంపట్నం బస్టాండ్ లో ప్రభుత్వ నిషేధిత గంజాయితో దిగినానని ఒప్పుకోగా అతని అదుపులోకి తీసుకొని అతని వద్ద గల 300 గ్రాముల ఎండు గంజాయి మరియు ఒక మొబైల్ ఫోన్లో సీజ్ చేసి అతని పైన కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించనైనది. ఇట్టి ఆపరేషన్ లో ఇబ్రహీంపట్నం ఎస్సై జి నవీన్ కుమార్ తో పాటుగా వారి సిబ్బంది కానిస్టేబుల్లు సంతోష్ కుమార్,ప్రశాంత్ చైతన్య,మహేందర్ లో చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్నారని మెట్టుపల్లి సీఐ బి సురేష్ బాబు, ఇబ్రహీంపట్నం ఎస్ ఐ నవీన్ కుమార్ కానిస్టేబుల్ సంతోష్ కుమార్, ప్రశాంత్ చైతన్య,మహేందర్ లను అభినందించినారు.




ఇకపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో యువత ప్రభుత్వాన్ని నిషేధిత గంజాయిని సరఫరా చేసిన లేదా గంజాయి తాగుతున్నట్లుగా సమాచారం వచ్చిన అట్టి వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని మెట్టుపల్లి సిఐ బి.సురేష్ బాబు మరియు ఇబ్రహీంపట్నం ఎస్సై జి నవీన్ కుమార్ తెలిపారు.

# ఆరుతడి పంటలకే జలాలు' తుంగభద్ర డ్యామ్ కు 'ఎల్ నినో' దెబ్బ

**కర్ణాటకలో వర్షాభావంతో డ్యామ్‌కు రాని వరద**

**170 టీఎంసీల ప్రవాహానికి బదులు**

**ఈసారి 98 టీఎంసీలే**

**తాగునీరు, ఆరుతడి పంటలకే నీరు ఇవ్వాలని ఇరు రాష్ట్రాల నిర్ణయం**



వాతావరణ శాస్త్రవేత్తలు ముందు నుంచి హెచ్చరిస్తున్నట్లుగానే 'సూపర్ ఎల్‌నినో' ప్రభావం తుంగభద్ర జలాశయంపై తీవ్రంగా పడింది. కర్ణాటకలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో తుంగ, భద్ర నదుల నుంచి డ్యామ్‌లోకి వరద రావడం లేదు. ఫలితంగా జలాశయం దాదాపు ఎండిపోయిన పరిస్థితికి చేరుకుంది. ఏటా ఈ సమయానికి డ్యామ్ పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుని క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేసేవారు. కానీ ఈ ఏడాది జలాశయం నిండటమే గగనంగా మారింది.నైరుతి రుతుపవనాల సీజన్‌లో తుంగభద్ర డ్యామ్‌కు సాధారణంగా 170 నుంచి 250 టీఎంసీల వరద వస్తుంది. కానీ ఈసారి కేవలం 98 టీఎంసీల ప్రవాహం మాత్రమే నమోదైంది. దీంతో జలాశయం గరిష్ఠ నీటి మట్టానికి చేరుకోలేదు. సెప్టెంబర్ నెలలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం లేదని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో కొత్తగా వరద వచ్చే అవకాశం లేకపోవడంతో జలాశయంలో చేరిన కొద్దిపాటి నీటినే ఇరు రాష్ట్రాలు పంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏపీ, కర్ణాటక ఈ నీటిని కేవలం తాగునీటి అవసరాలకు, ఆరుతడి పంటలకు మాత్రమే వినియోగించాలని ఉమ్మడిగా నిర్ణయించాయి. దీంతో ఆయకట్టు రైతులు ఆరుతడి పంటల సాగుతోనే సరిపెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది.తుంగభద్ర జలాశయం క్రస్ట్ గేటు 2024 ఆగస్టులో వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో క్రస్ట్ గేట్ల భద్రత ముప్పుగా మారిందని నీటి నిల్వను 105 టీఎంసీలకు బదులుగా 80 టీఎంసీలకే పరిమితం చేయాలని నిపుణులు సూచించారు. దీంతో 2024-2025లో ఏపీ, కర్ణాటక రాష్ట్రాల ఉమ్మడి నిర్ణయంతో నీటి నిల్వను 80 టీఎంసీలకు పరిమితం చేశారు. జలాశయం భద్రతపై సాంకేతిక పరీక్షలు నిర్వహించిన నిపుణులు, తక్షణమే గేట్లు మార్చాలని నివేదిక ఇచ్చారు.దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం రూ.52 కోట్లు విడుదల చేసి, గతేడాది డిసెంబర్‌లో గేట్ల మార్పిడికి శ్రీకారం చుట్టింది. పనుల కోసం డ్యామ్‌లోని నీటిని కాలువల ద్వారా వదిలేసి డెడ్ స్టోరేజీకి చేర్చారు. ఆ సమయంలో రైతులు రెండో పంటను త్యాగం చేసి ప్రభుత్వానికి సహకరించారు. అన్నదాతల సహకారంతో ఏపీ సర్కార్ కేవలం ఆరు నెలల్లోనే జలాశయానికి ఉన్న 33 గేట్లు, వాటి గొలుసులను మార్చి సరికొత్త రికార్డు సృష్టించింది. జూన్ నాటికే వరద నీటిని నిల్వ చేసేందుకు డ్యామ్‌ను సిద్ధం చేశారు. కానీ ఈసారి సరైన ప్రవాహాలు రాకపోవడంతో కొత్త గేట్లను దాటి నీరు రాని పరిస్థితి నెలకొంది.అనంతపురం జిల్లాకు 16 టీఎంసీలు సీజన్ ప్రారంభానికి ముందు జలాశయంలో కేవలం 9 టీఎంసీల నిల్వ మాత్రమే ఉంది. ఇప్పటి వరకు ఏపీ, కర్ణాటక 5 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాల కోసం మళ్లించాయి. ఐఏబీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు అనంతపురం జిల్లాకు 16 టీఎంసీల కోటాను కేటాయించారు. ఇందులో 8 టీఎంసీలను తాగునీటికి, మిగిలిన నీటిని ఆరుతడి పంటలకు ఇవ్వనున్నారు. ఇప్పటికే హెచ్ఎల్‌సీ, జీబీసీ కాలువల ద్వారా రైతులకు ఆరుతడి పంటల సాగుకు నీటిని విడుదల చేశారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం వచ్చే ఏడాది జూన్ వరకు కొనసాగుతుందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో తాగునీటికే తొలి ప్రాధాన్యత ఇస్తూ, ఎక్కడికక్కడ అవకాశం ఉన్న మేర నీటిని ప్రభుత్వం నిల్వ చేస్తోంది."గతేడాది డ్యామ్ గేట్ల మార్పిడి కోసం మేమంతా రెండో పంటను త్యాగం చేశాం. కొత్త గేట్లు ఏర్పాటై ఈసారైనా పంటలకు పుష్కలంగా నీరు అందుతుందని ఆశించాం. కానీ వర్షాభావ పరిస్థితుల వల్ల వరద రాకపోవడం దురదృష్టకరం. రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ఆరుతడి పంటలనే సాగు చేసుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి."-చంద్రశేఖర్ రెడ్డి, ఏపీ రైతు సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడు "కర్ణాటకలో ఈసారి వర్షాలు ఆశాజనకంగా లేవు. తుంగ, భద్ర నదుల నుంచి డ్యామ్‌లోకి ఆశించిన స్థాయిలో ప్రవాహం రాలేదు. ప్రకృతి అనుకూలించని కారణంగా నీటి కొరత ఏర్పడింది. ఉన్న కొద్దిపాటి నీటినే రెండు రాష్ట్రాల రైతులు, ప్రజలు పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత ఉంది."-పురుషోత్తం, కర్ణాటక రైతు సంఘం బళ్లారి జిల్లా అధ్యక్షుడు"ఈ ఏడాది అనంతపురం జిల్లాకు 16 టీఎంసీల నీటి కోటా కేటాయించడం జరిగింది. ఇందులో 8 టీఎంసీలు కేవలం తాగునీటి అవసరాలకే వినియోగిస్తాం. మిగిలిన నీటిని హెచ్చెల్సీ, జీబీసీ కాలువల ద్వారా ఆరుతడి పంటల సాగుకు విడుదల చేస్తున్నాం. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రైతులు నీటిని వృథా చేయకుండా అత్యంత జాగ్రత్తగా వాడుకోవాలని కోరుతున్నాం."-సుధాకర్, హెచ్ఎల్‌సీ ఎస్ఈ

# బొల్లారం ఆర్మీ క్యాంపులో ఆయుధాల చోరీ ఫైరింగ్ రేంజ్ గోడ సమీపంలో డిటోనేటర్లు

**మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ క్యాంపు సమీపంలో డిటోనేటర్లు**

**ఫైరింగ్ రేంజ్ వెనుక గోడ సమీపంలో ప్లాస్టిక్ బకెట్‌లో డిటోనేటర్లు**

అల్మార తాళం బద్దలు కొట్టి పెట్టెను పగలగొట్టిన దుండగులు

హైదరాబాద్ బొల్లారం ఆయుధాల చోరీ వ్యవహారాన్ని రక్షణ మంత్రిత్వశాఖ తీవ్రంగా పరిగణించింది. చోరీకి గురైన ఆయుధాలు ప్రాణాంతకమైనవి కావడంతో పోలీసులు, సైనిక అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. అసలు దుండగులు ఎవరు ఆయుధాల నిల్వచేసే పరిసరాలకు ఎలా వచ్చారు హనీట్రాప్ ఏమైనా జరిగిందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న హైదరాబాద్ బొల్లారం రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ వ్యవహారం జటిలమవుతోంది. కేసు నమోదైన 48 గంటల తర్వాత దర్యాప్తులో పురోగతి లభించింది. మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ క్యాంపు సమీపంలో డిటోనేటర్లు లభ్యమయ్యాయి. ఫైరింగ్ రేంజ్ వెనుక గోడ సమీపంలో ప్లాస్టిక్ బకెట్‌లో 8 బండిల్స్‌లో 160 ఎలక్ట్రికల్ డిటోనేటర్లు ఉన్నట్లు గుర్తించారు. ఒక్కో బండిల్‌లో 20 డిటోనేటర్లు ఉండగా వాటి విలువ రూ.32 వేలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆర్మీ సిబ్బంది సమాచారంతో బొల్లారం పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. డిటోనేటర్ల లభ్యంపై మల్కాజిగిరి బాంబ్ డిస్పోజల్ టీమ్‌కు సమాచారం అందించారు. 3కిలో సైజ్ కమర్షియల్ ఎలక్ట్రికల్ డిటోనేటర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డిటోనేటర్లను అక్కడ వదిలివెళ్లింది ఎవరు అని పోలీసులు ఆరా తీస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులపై ఎక్స్‌ప్లోసివ్ సబ్‌స్టెన్సెస్ యాక్ట్ సెక్షన్లు 4, 5 కింద కేసు నమోదు చేశారు. ఆర్మీ క్యాంపులో ఆయుధాల మిస్సింగ్ కేసు నేపథ్యంలోనే డిటోనేటర్లు లభ్యం కావడం కలకలం రేపుతోంది.చోరీ అయిన ఆయుధాలు సంఘవిద్రోహ శక్తుల చేతుల్లో పడితే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయన్న ఉద్దేశంతో ఒక్క ఆధారాన్నీ వదలకుండా ప్రయత్నిస్తున్నారు. అయితే దర్యాప్తు జరుగుతున్న కొద్దీ విస్మయం కలిగించే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. దుండగులు ఏయే ఆయుధాలు చోరీ చేశారో వాటికి తగ్గ తూటాలనే ఎత్తుకెళ్లినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో "హనీట్రాప్" కోణం ఏమైనా ఉందా అనే అంశంపైనా దృష్టి పోలీసులు సారించారు.ఏయే ఆయుధాలు చోరీ చేశారో వాటికి తగ్గ తూటాలే చోరీ : కేసులో రాత్రీపగలూ తేడా లేకుండా అనేక కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నా ఇంత వరకూ ఇసుమంతైనా పురోగతి సాధించలేదు. ఇక్కడ నాలుగు ఏకే 203 రైఫిళ్లు, ఏడు 9 వీవీ పిస్టళు, ఒక ఇన్సాస్ చోరీకి గురికాగా, దుండగులు ఏయే ఆయుధాలను అపహరించారో సరిగ్గా వాటికి సరిపోయే తూటాలనే ఎత్తుకెళ్లారు. దీన్నిబట్టి పక్కా ప్రణాళికతోనే చోరీకి పాల్పడ్డారని పోలీసులు భావిస్తున్నారు. కచ్చితంగా ఆయుధాల గురించి బాగా తెలిసిన వారే చోరీ చేసి ఉంటారని నిర్ధరణకు వస్తున్నారు. మద్రాస్ రెజిమెంట్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అందర్నీ పోలీసులు ప్రశ్నిస్తున్నారు. అయినా ఒక్కరి నుంచి కూడా అనుమానించదగ్గ సమాచారం రాలేదు. రెజిమెంట్‌కు వచ్చే అన్ని రహదారులలోని వందల సీసీ కెమెరాలను స్థానిక పోలీసులు జల్లెడ పడుతున్నారు. అయినా ఒక్క క్లూ కూడా దొరకలేదని తెలుస్తోంది.ఆయుధాలు, మందుగుండు రికార్డులు సరిగా లేవు సోమవారం ఉదయం కోటెను తనిఖీ చేసినపుడు ఆయుధాలు, మందుగుండు చోరీ అయినట్లు గుర్తించామని సైనికాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో పాల్గొంటున్న అధికారులు దీనిపై సందేహాలు వ్యక్తం



చేస్తున్నారు. కొంతకాలంగా అవకాశం దొరికినప్పుడల్లా కొద్దికొద్దిగా మందుగుండును తప్పించి, ఆ తర్వాత ఆయుధాలు చోరీ చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అయితే అల్మారీలో ఆయుధాలు, మందుగుండు నిల్వల రికార్డులు సరిగా నిర్వహించడం లేదని పోలీసులు గుర్తించారు. ఇది కూడా అనుమానాలకు తావిస్తోంది. దుండగులు తలుపునకు వేసిన తాళం బద్దలు కొట్టి లోపల తూటాలు ఉంచిన పెట్టెలనూ పగలగొట్టారు. అయినా సమీపంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఎలాంటి శబ్దాలూ వినిపించలేదు. దీనిపై అధికారులు ప్రశ్నించినప్పుడు ఆరోజు రాత్రి పెద్ద వర్షం పడిందని, అందుకే శబ్దాలు వినిపించలేదని సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది.హానీట్రాప్ కోణంలోనూ పరిశీలిస్తున్నట్లు అధికారులు : మద్రాస్ రెజిమెంట్‌లోని సిబ్బందిని హానీట్రాప్‌లో దించి దుండగులు చోరీకి పాల్పడి ఉంటారా అనే కోణంలోనూ పరిశీలిస్తున్నట్లు ఆర్మీ ఉన్నతాధికారులు తెలిపారు. సిబ్బంది సోషల్ మీడియా ఖాతాలు, ఫోన్లు, కంప్యూటర్లు పరిశీలిస్తున్నారు. ఒకవేళ హానీట్రాప్ ఉదంతం ఉండి ఉంటే ఈ కుట్ర మరింత పెద్దదిగా మారే అవకాశం ఉంది. దీని వెనుక దేశవిద్రోహశక్తులు ఉండే అవకాశంతో పాటు ఆయుధాలు వారి చేతికి చేరితే ప్రమాదం ఎప్పుడైనా ముంచుకొచ్చే అవకాశం ఉంది.

# పూజలతో అనారోగ్యం నయం చేస్తామని రూ.62లక్షలు స్వాహా నిందితులు అరెస్టు

**అనారోగ్యం నయం చేస్తామని చెప్పి మహిళ నుంచి డబ్బులు కాజేసిన కేటుగాళ్లు**

**ఎన్ని పూజలు చేసినా కుదుటపడని ఆరోగ్యం**

**డబ్బులు తిరిగి అడిగితే చేతబడి చేస్తామంటూ బెదిరింపులు నిందితులు అరెస్టు**




అనారోగ్యానికి గురైతే ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటాం. నయం కాకపోతే ఇంకో ప్రయత్నం చేస్తాం. అయినా సమస్య పరిష్కారం కాకపోతే మరిన్ని మార్గాలు అన్వేషిస్తాం. ఆ మహిళ కూడా అదే పనిచేసింది. ఓ ఇద్దర్ని నమ్మింది. ఏళ్లుగా ఇబ్బంది పబెడుతున్న తన అనారోగ్యాన్ని నయం చేస్తారని భావించింది. వారు కూడా ఆమెకు అదే స్థాయిలో భరోసా ఇచ్చారు. మేముండగా నీకెందుకు చింత అని చెప్పుకొచ్చారు. వారు చెప్పిందల్లా ఆమె చేసింది. ఆరోగ్యం కోసం నానాపాట్లు పడింది. చివరకు మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. అసలు వారెవరు అనారోగ్యాన్ని నయం చేయడానికి వారు ఎంచుకున్న మార్గం ఏంటి చివరకు పోలీసులు ఏం తేల్చారు. క్షుద్రపూజలతో అనారోగ్యాన్ని నయం చేస్తామని గతనెల సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌కు ఓ మహిళ ఆందోళనగా వచ్చింది. ఇద్దరు వ్యక్తులు తనకు ఇవ్వాల్సిన సుమారు 62 లక్షల రూపాయలను ఇవ్వడం లేదంటూ ఫిర్యాదు చేసింది. అంత పెద్ద మొత్తంలో డబ్బు ఇచ్చారంటే అప్పుగానో ఆస్తికోసమో అని అంతా అనుకున్నారు. కానీ తనకున్న అనారోగ్యాన్ని నయం చేసేందుకు వారికి డబ్బులు ఇచ్చానని ఆ మహిళ చెప్పింది. రోగాన్ని నయం చేస్తారంటే డబ్బులు తీసుకున్న వ్యక్తులు డాక్టర్లో కార్పొరేట్ ఆసుపత్రి వాళ్లో అనుకుంటే పొరపాటే. డబ్బులు తీసుకున్న వాళ్లు అసలు వైద్యులే కాదు పూజలు చేసి ఆమె ఆరోగ్యాన్ని నయం చేస్తామని నమ్మించిన కేటుగాళ్లు. హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన లత పూజా సామాగ్రి కోసం తూంకుంటలోని భద్రకాళీ పూజా స్టోర్‌కు తరచూ వెళ్లేది. దుకాణ నిర్వాహకుడు శ్యాం కుమార్‌తో ఉన్న పరిచయంతో చాలాకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నానని ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కావడం లేదని తన బాధల్ని పంచుకుంది. వైద్యం దాకా ఎందుకు క్షుద్ర పూజలతో అనారోగ్యాన్ని ఇట్టే నయం చేయొచ్చని శ్యాంకుమార్ చెప్పాడు. మంత్రాలతో దీర్ఘకాలిక వ్యాధులు నయం చేసే వ్యక్తి తనకు పరిచయం ఉన్నాడని చెప్పాడు. వేములవాడ అగ్రహారానికి చెందిన లక్ష్మీరాజాన్ని సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద ఆమెకు పరిచయం చేశాడు. అనారోగ్యాని దేముంది నయం చేసేద్దామని లక్ష్మీరాజం లతకు చెప్పాడు.మహిళ నుంచి రూ.62 లక్షలు కాజేసి తొలుత పూజాసామాగ్రి కోసం శ్యామ్‌కుమార్, లక్ష్మీరాజం 10లక్షల రూపాయలు అడిగారు. వెంటనే లత 10లక్షలు ముట్టజెప్పింది. పూజల పేరుతో ఆమెను వివిధ స్థలాలకు తిప్పారు. యాదగిరి గుట్ట వద్ద 21 లక్షలు, కాశీలో 13 లక్షల రూపాయలు తీసుకున్నారు. మళ్లీ డబ్బుకావాలంటే శ్యామ్‌కుమార్ ఇచ్చిన బ్యాంకు అకౌంట్లకు విడతల వారీగా మొత్తం 62 లక్షలు ఆ మహిళ పంపించిం ది.తెల్లకాగితాలపైన మహిళ సంతకాలు సైతం తీసుకున్నారు. ఎన్ని పూజలు చేసినా రోగం నయం కాలేదు. తగ్గే సూచనలూ కనిపించలేదు. దీంతో డబ్బులిచ్చేయండని లత వారిని నిలదీసింది. దీంతో అటువైపు నుంచి బెదిరింపులు మొదలయ్యాయి. చేతబడి చేసి ఆమెను, ఆమె కుటుంబాన్ని అంతమొందిస్తామని బెదిరించారు. అయినా లత పట్టువీడలేదు. దీంతో ఆమె వ్యవసాయ పొలంలో గుప్త నిధులు వెలికి తీస్తామని నమ్మించారు. డబ్బులివ్వాల్సిందేనని లత పట్టుబట్టడంతో ఈ నెల 23న డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పి సిరిసిల్ల బస్టాండ్ వద్దకు రమ్మన్నారు. ఆమె వెళ్లింది. కాని ఇద్దరూ రాలేదు. విసిగి వేసారినలత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు."ఓ మహిళ కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. పూజచేస్తే అనారోగ్య సమస్య తగ్గుతుందని మహిళను నిందితులు నమ్మించారు. ఆమె నుంచి రూ.62 లక్షలను కాజేశారు. ఇద్దరు నిందితులను పట్టుకుని వారి ఇళ్లలో తనిఖీలు నిర్వహించగా మొత్తం రూ.30.15లక్షలు నగదు రికవరీ అయింది. మరికొంత మొత్తం ఆన్‌లైన్‌లో అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయింది. రెండు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నాం"-మహేశ్ బి. గితే, ఎస్పీ, రాజన్న సిరిసిల్లనిందితులు అరెస్టు : కరీంనగర్ జిల్లా కేంద్రం మంకమ్మతోటకు చెందిన శ్యామ్‌కుమార్ హైదరాబాద్‌లోని తూముకుంటలో భద్రకాళీ పూజా స్టోర్ నడుపుతున్నాడు. అతని వద్దకు చాలా మంది పూజా సామాగ్రి కోసం వస్తుంటారు. వేములవాడ అగ్రహారానికి చెందిన పత్తెం లక్ష్మీరాజమ్ కూడా అతని వద్దకు పూజా సామాగ్రి కోసం వచ్చేవాడు. లక్ష్మీరాజం అగ్రహారం చుట్టు పక్కగ్రామాలలో క్షుద్ర పూజలు చేస్తాడు. మంత్రాలు, తంత్రాలు, దిష్టి తీయడం, చేతబడుల పేరుతో పూజా సామాగ్రిని అక్కడ కొనుగోలు చేస్తాడు. మూఢనమ్మకాలు నమ్మే అమాయక ప్రజల వద్ద డబ్బులు తీసుకుని పూజలు చేస్తుంటానని శ్యాంకుమార్‌కు చెప్పాడు.ఎవరైనా అలాంటి నమ్మకాలతో క్షుద్రపూజలు, చేతబడి చేయాలని కోరితే తన గురించి గొప్పగా చెప్పాలని లక్ష్మీరాజం శ్యాంకుమార్‌కు సూచించాడు. బాధితుల నుంచి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేయవచ్చని వచ్చిన దాంట్లో చెరిసగం పంచుకోవచ్చని ప్రతిపాదన తెచ్చాడు. అందుకు అంగీకరించిన శ్యామ్ ఈ మోసానికి తెరలేపి లతను మోసగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు వేములవాడ అగ్రహారంలోని లక్ష్మీరాజమ్ ఇంటి వద్ద ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి కొంత నగదు ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కేసులో నిందితులను పట్టుకోవడంలో కీలక భూమిక పోషించిన డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, ఎస్.ఐ గణేష్ , సిబ్బంది ని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అనారోగ్య సమస్యలకు క్షుద్ర పూజలు, చేతబడులు, మంత్రాలు పరిష్కారం కాదని ప్రజలు గుర్తించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# మద్యం కుంభకోణం కేసు నిందితుడు షేక్ సైఫ్ అహ్మద్‌ను లొంగిపోవాలన్న ఏసీబీ కోర్టు

**15 రోజుల్లోగా లొంగిపోవాలని ఏసీబీ కోర్టు ఆదేశం**

**ఆలోగా అరెస్టు చేయొద్దని సిట్‌ను ఆదేశించలేమన్న కోర్టు**

వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణం కేసులో నిందితుడు షేక్ సైఫ్ అహ్మద్ 10) 15 రోజుల్లోగా లొంగిపోవాలని విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం ఆదేశించింది. ఆలోగా అతన్ని అరెస్టు చేయొద్దంటూ సిట్‌ను ఆదేశించలేమని స్పష్టం చేసింది. ఈ మేరకు ఏసీబీ కోర్టు న్యాయాధికారి తేజోవతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.కూటమి అధికారంలోకి రాగానే మద్యం కుంభకోణం మూలాలు వెలికితీస్తుండటంతో సైఫ్ అహ్మద్ 2024 ఆగస్టు 9న దుబాయ్‌కు పారిపోయాడు. కేసు దర్యాప్తులో భాగంగా అతని పాత్రపై సిట్ అధికారులు వివరాలు సేకరించారు. గత ఏడాది మే నెలలో అతనిపై లుకౌట్ సర్క్యులర్ జారీ చేశారు. విదేశాల నుంచి వస్తే అరెస్టు తప్పదని భావించి, గత్యంతరం లేని పరిస్థితుల్లో సైఫ్ అహ్మద్ జులై నెలలో లొంగుబాటు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఏసీబీ న్యాయస్థానం లొంగిపోవాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.డొల్ల కంపెనీల్లో ప్రధాన భాగస్వామి: మద్యం డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి లంచాలు వసూలు చేసేందుకు మద్యం కుంభకోణం ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి ఏర్పాటు చేసుకున్న నెట్‌వర్క్‌లో సైఫ్ అహ్మద్ అత్యంత కీలక సభ్యుడుగా సిట్ గుర్తించింది. కొల్లగొట్టిన సొత్తు దారి మళ్లించేందుకు టి.ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి (ఏ-9) నేతృత్వంలో ఏర్పాటైన డొల్ల కంపెనీల్లో ప్రధాన భాగస్వామిగా ఉన్నట్లు తెలిపింది. వారిద్దరి ప్రతినిధిగా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించింది.ఎంతెంత వసూలు చేయాలో లెక్కలు కట్టి: ఏపీఎస్‌బీసీఎల్‌లో అప్పట్లో ప్రత్యేకాధికారిగా పనిచేసిన సత్యప్రసాద్, డేటా ఎంట్రీ ఆపరేటర్ అనూషలు అత్యంత రహస్యంగా ఉండాల్సిన మద్యం విక్రయాల డేటాను రాజ్ కెసిరెడ్డి ఆదేశాల మేరకు రియల్ టైమ్‌లో సైఫ్ అహ్మద్‌కు చేరవేసేవారని సిట్ పేర్కొంది. ఏయే డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి ఎంతెంత లంచాలు వసూలు చేయాలో లెక్కలు కట్టి సైఫ్ అహ్మద్, రాజ్ కెసిరెడ్డికి పంపించేవాడని సిట్ తెలిపింది.అవకాశం లేక లొంగుబాటు పిటిషన్ దాఖలు: తర్వాత దశల్లో రాజ్ కెసిరెడ్డి తన నెట్‌వర్క్ ద్వారా ఆయా డిస్టిలరీలు, సరఫరా కంపెనీల నుంచి లంచాల సొమ్ము



వసూలు చేసినట్లు సిట్ తెలిపింది. డొల్ల కంపెనీల నిర్వహణ, బోగస్ పత్రాలు, బిల్లుల సృష్టి, నగదు అక్రమ రవాణా వంటి వాటిల్లోనూ సైఫ్ అహ్మద్ కీలకంగా వ్యవహరించారని వెల్లడించింది. ఈ కేసులో మిగతా నిందితులంతా అరెస్టు కావడం, సిట్ విచారణ నుంచి తప్పించుకునే అవకాశం లేకపోవటంతో సైఫ్ అహ్మద్ లొంగుబాటు పిటిషన్ దాఖలు చేశారని సిట్ పేర్కొంది.

# డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం విశాఖ, తిరుపతి జూలల్లో పారిశుద్ధ్య కార్యక్రమానికి శ్రీకారం

**విశాఖ, తిరుపతి జూలల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు**

**జంతువులకు ఆరోగ్యకర వాతావరణాన్ని కల్పించేలా ఏర్పాట్లు**

**వన్యప్రాణుల సంరక్షణ బాధ్యతగా స్వీకరించాలని పవన్ పిలుపు**



వన్యప్రాణుల ఆరోగ్యం, సందర్శకులకు మెరుగైన వాతావరణమే లక్ష్యంగా విశాఖ, తిరుపతి జంతు ప్రదర్శనశాలల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడిం చారు. జూ ప్రాంగణాలు పరిశుభ్రంగా, పర్యావరణహితంగా తీర్చిది ద్దడం ద్వారా జంతువులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని పవన్ సూచించారు.ఈ మేరకు తిరుపతి శ్రీ వేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల, విశాఖ ఇందిరా గాంధీ జూ అధికారులు పారిశుద్ధ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జంతువుల ఆవాస ప్రాంతాలు, సందర్శకుల మార్గాలు, ఉద్యానవనాలు, నీటి వనరులు, విశ్రాంతి ప్రాంతాలు, ఆహార పంపిణీ కేంద్రాలు, వ్యర్థాల సేకరణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. జూ పరిసరాల్లో వ్యర్థాల వర్గీకరణ, ప్లాస్టిక్ తొలగింపు, పచ్చదనం పెంచేలా చర్యలు తీసుకున్నారు.క్రమం తప్పకుండా నిర్వహించాలి: విశాఖ జూలో అధునాతన ఇంక్యుబేషన్ పద్ధతిలో ఇటీవల 128 కొత్త జీవాలకు జన్మనిచ్చిన నేపథ్యంలో జీవ వైవిధ్య పరిరక్షణ చర్యలకు మద్దతుగా విశాఖతో పాటు తిరుపతి జూలల్లో జంతువులను దత్తత తీసుకునేందుకు కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు ముందుకు రావాలని పవన్ పిలుపునిచ్చారు.వన్యప్రాణుల సంరక్షణను ప్రతి పౌరుడు బాధ్యతగా స్వీకరించాలని కోరారు. జంతు ప్రదర్శనశాలలు కేవలం వినోద కేంద్రాలు మాత్రమే కాకుండా, వన్యప్రాణుల సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ అవగాహనకు కేంద్ర బిందువులుగా నిలవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. క్రమం తప్పకుండా జూలల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.ం

# ఏపీ, తెలంగాణలో వానలు.. అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరిక

**తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడి**

**13 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**

**ఏపీలో సెప్టెంబర్ 5 వరకు వర్షాలు కురిసే అవకాశం**

**బంగాళాఖాతంలోకి మత్స్యకారులు వెళ్లవద్దని హెచ్చరిక**



తెలుగు రాష్ట్రాల్లో రానున్న కొద్దిరోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించి ంది. మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతా ల్లో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు వాతావరణ శాఖ అధికారులు 13 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, తెలంగాణలోని హైదరాబాద్, జగిత్యాల, కామారెడ్డి సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈశాన్య మధ్యప్రదేశ్ పరిసరాల్లో అల్పపీడనం కొనసాగుతుండగా, దానికి అనుబంధంగా సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. దీనికి తోడు, మధ్యప్రదేశ్ నుంచి తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు రుతుపవన ద్రోణి కూడా కొనసాగుతోందని, వీటి ప్రభావంతోనే వర్షాలు కురుస్తాయని అధికారులు వివరించారు.ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 3, 4 తేదీల్లో మత్స్యకారులు చేపల వేట కోసం బంగాళాఖాతంలోకి వెళ్లవద్దని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఈదురుగాలులు బలంగా వీచే అవకాశం ఉన్నందున, ప్రజలు విద్యుత్ స్తంభాలు, భారీ హోర్డింగ్‌ల కింద ఉండరాదని, అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు.

# సాయికృష్ణ లాకప్ డెత్ కేసు నలుగురు పోలీసుల బెయిల్ పిటిషన్లు కొట్టివేత

**గాదె సాయి కృష్ణ లాకప్ డెత్ కేసులో బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించిన నిందితులు**

**నలుగురు నిందితుల బెయిల్ పిటిషన్లను కొట్టివేసిన కోర్టు**

**మాజీ సీఐ నాగరాజు సహా నలుగురు అధికారులు జైల్లోనే**

**ప్రస్తుతం వేర్వేరు జైళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నిందితులు**



విజయవాడలో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న నలుగురు పోలీసు అధికారుల బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం తిరస్కరించింది. దీంతో వారు మరికొంత కాలం జైలులోనే గడపాల్సి ఉంటుంది.ఈ కేసులో నిందితులుగా ఉన్న మాజీ సీఐ నాగరాజు (ఏ1), హెడ్ కానిస్టేబుల్ జంగం నాని (ఏ3), హెడ్ కానిస్టేబుల్ బాబురావు (ఏ5), సాంబయ్య (ఏ6) తమకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ విజయవాడలోని 8వ ఏడీజే కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన న్యాయస్థానం, నిందితుల అభ్యర్థనను తోసిపుచ్చుతూ వారి పిటిషన్లను కొట్టివేసింది.ప్రస్తుతం ఈ నలుగురు రిమాండ్ ఖైదీలుగా వేర్వేరు జైళ్లలో ఉన్నారు. సీఐ నాగరాజు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉండగా, జంగం నాని ఏలూరు సబ్ జైలులో, బాబురావు అవనిగడ్డ సబ్ జైలులో, సాంబయ్య గన్నవరం సబ్ జైలులో ఉన్నారు. తాజా తీర్పు నేపథ్యంలో వారంతా జైలుకే పరిమితం కానున్నారు. ఈ కేసులో తదుపరి విచారణ ఎలా సాగుతుందనే అంశంపై ప్రస్తుతం సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# బాలిక మిస్సింగ్ కేసు.. గుంటూరు పోలీసులపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

**పోలీసుల తీరు ప్రభుత్వానికే సిగ్గుచేటని వ్యాఖ్య**

**మూడు నెలలుగా బాలిక ఆచూకీ లేకపోవడంతో తండ్రి పిటిషన్**

**గురువారంలోగా బాలికను హాజరుపరచాలని డీజీపీకి ఆదేశం**





పదో తరగతి విద్యార్థిని అదృశ్యమైన కేసులో గుంటూరు జిల్లా పోలీసుల తీరుపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలీసుల నిర్లక్ష్యంపై మండిపడిన ధర్మాసనం, "గుంటూరు జిల్లా పోలీసులు చాలా గ్రేట్" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించింది.కేసు వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గత జూన్ నెలలో ఓ బాలిక ట్యూషన్‌కు వెళ్లి అదృశ్యమైంది. దీనిపై బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, మూడు నెలలు గడిచినా బాలిక ఆచూకీ లభించకపోవడంతో, ఆయన హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు.బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, పోలీసుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉన్నప్పటికీ ఒక బాలికను కనిపెట్టలేకపోవడం సిగ్గుచేటని అభిప్రాయపడింది. గతంలో సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్‌ను పోలీస్ స్టేషన్‌కు రాకుండా అడ్డుకున్న ఘటనను గుర్తుచేస్తూ, ఇలాంటి పోలీసులు ఉండటం ప్రభుత్వానికే సిగ్గుచేటని ఘాటు వ్యాఖ్యలు చేసింది.కేసు విచారణలో పోలీసులు సరైన స్ఫూర్తితో పనిచేయడం లేదని పేర్కొన్న కోర్టు, గురువారం నాటికల్లా బాలికను తమ ముందు హాజరుపరచాలని ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com